

'సివిల్ సప్లయ్' కేసు ఎసిబి స్పీడ్..!

డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును ఎసిబి వేగంగా విచారణ జరుపుతోంది. గత నెల 7వతేదీ సాగుతోన్న కేసులో నెల్లూరు ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. గుంటూరు నుంచి ప్రత్యేక అధికారిని ఇందుకోసం నియమించారు. ఈ కేసులో మొత్తం 32 మంది పేర్లు బయటకొచ్చాయి. ఇప్పటి వరకు 14 మంది అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. జెసి ఇచ్చిన నివేదికతో పాటు ఎసిబి విచారణలో బయటకొస్తున్న అనేక మందిని అరెస్ట్‌చేసినట్లు తెలుస్తోంది. గత నెల 7వతేదీ నుంచి కేసు నడుస్తుంగా, ఈ నెల 6న ఎసిబికి ఉన్నతాధికారులు అప్పగించారు. ఎసిబి అధికారులు రాత్రి, పగలు తీరికలేకుండా విచారణ కొసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 1.5 కేజీ బంగారం,14 ఖరీదైన వాహనాలు, ఇళు ,, పొలాలు, ఇతర ఆస్తులు సుమారు రూ.20 కోట్ల వరకు రికవరీ చేసినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ కేసుతో సంబందం ఉన్న వ్యక్తులందరూ జైలుకు వెళ్లడం ఖాయంగా తెలుస్తోంది.

◆రూ.20 కోట్లు సీజ్

◆1.5 కేజీల బంగారం, 14 వాహనాలు స్వాధీనం

◆కేసులో 32 మంది, 14 మందికి రిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును రాష్ట్ర ఎసిబి అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 వతేదీ నుంచి జిల్లా ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు నేతృత్వంలో విచారణ వేగంగా సాగుతోంది. డిఎం సివిల్ జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, బయట వ్యక్తులకు సంబందించిన వివరాలు మొత్తం రాబడుతున్నారు. జెసి కూర్మానాధ్ ప్రాథమిక విచారణలో మొత్తం రూ.40 కోట్లు, 32 మంది అవినీతికి పాల్పడ్డారని రికార్డుల ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అప్పటికే జెసి అవినీతిపరుల ఆస్తులు గుర్తించి, అటాచ్ చేసుకున్నారు. ఈ కేసులో కీలకమైన వ్యక్తిగా ఉన్న ఎస్.శివకుమార్ ఉంటున్న ధనలక్ష్మీపురంలోని ఆయన నివాసాన్ని సీజ్ చేశారు. కోవూరులో శివ బావమర్ది సూర్య పవన్ ఇల్లు, యల్లాయపాళెంలోని భూమి, కోవూరులో మూడు విల్లాలు, స్వాధీనం చేసుకున్నారు. దర్గామిట్టలో ఎస్ఎస్ రిస్టో బార్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గొలగమూడి రోడ్డులోని దయాకర్‌కు చెందిన రూ.1.49 కోట్లు విలువైన విల్లా, పక్కనే రాజాకు చెందిన మరో రూ.1.49 కోట్లు విల్లా, జెసి నివేదికలోనే గుర్తించారు. తొలి విడతగా సివిల్ సప్లయ్ ఆడిట్‌లో బయటపడిన రూ.29.78 కోట్లకు సంబంధించి అక్టోబర్ 14న జెసి 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సివిల్‌సప్లయ్ అధికారుల ఆడిట్ వివరాలు మేరకు దీనిని గుర్తించారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇంటర్‌నిల్ ఆడిట్‌లో వచ్చిన సమాచారం మేరకు 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.6,52,41,821లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.15,70,51,594లు, 2022-23 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు రూ.7,55,35,389లు అవినీతికి పాల్పడ్డారు మొత్తం రూ.29.78 కోట్లుగా తొలుత గుర్తించి కేసు నమోదు చేశారు. పొదుపు సమైఖ్యలకు చెల్లించాల్సిన రూ.10.41 కోట్లల్లో రూ.7.60 కోట్లు మాయమైనట్లు అధికారులు తేల్చారు.తొలుత రూ.4.50 కోట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లోనూ, మరో మొత్తం మరో బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ మొత్తం వ్యవహారం 2016 నుంచి ఇప్పటి వరకు పనిచేసిన డిఎంల ఆధ్వర్యంలో జరిగినట్లు ప్రాథమిక జెసి విచారణలో తేలింది. జెసి విచారణలో రూ.40 కోట్లు అవినీతి బయటపడింది. మరో రూ.25 కోట్లు తేలాల్సి ఉంది. ఎసిబి అధికారులు కేవలం రూ. 29.78 కోట్లకు సంబంధించి విచారణ జరుపుతున్నారు.

ఎసిబి రాకతో పుంజుకుని..!

సివిల్ సప్లయ్ కేసును ఎసిబి తీసుకున్న తరువాత వేగంగా ముందుకు సాగుతోంది. ఈ కేసులో మొత్తం రూ.40కోట్లు అవినీతికి సంబంధించి 32 మందికి సంబంధాలున్నట్లు జెసి తన నివేదికలో పేర్కొంది. అక్టోబర్ 14న రూ.29.78 కోట్లకు సంబంధించి 11 మందిపై 5వ నగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్.శివకుమార్, దయాకర్, పవన్, రాజా, డిఎం ప్రత్యూషాలు అర్జును అరెస్ట్ చేశారు. శివకుమార్ మామ పెంచలయ్య, భార్యను ఎసిబి అధికారులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. ఇప్పటి వరకు 14 మంది ఎసిబి అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. కేసు లోతుగా బయటకు పడుతోన్న వ్యక్తులను అరెస్ట్ చేస్తున్నారు. శివకుమార్ తనకు అత్యంత సన్నిహితురాలైన ఉషా అనే మహిళకు సుమారు 2 కేజీల బంగారం కొనుగోలుచేసి ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో ఎసిబి అధికారులు 1.50 కేజీల బంగారం రికవరీ చేశారు. రాజా ఇంట్లో ఉన్న రూ.7 లక్షల విలువైన సోనీ టివిని రికవరీ చేశారు. ఇవి కాకుండా 14 ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. స్కోడా, ఎంజికోహెక్టర్ ముఖ్యమైన వాహనాలున్నాయి. కేసు లోతుగా విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తూ ముందుకుపోతున్నారు. ఏ ఒక్కరూ ఈ కేసులో తప్పించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. రానున్న రోజుల్లో ఉన్నతాధికారులను అరెస్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోర్టుకు కావాల్సిన అధికారులు మొత్తం సేకరిస్తున్నారు. ఎసిబి చరిత్రలో ప్రతిష్టాత్మకమైన కేసు కావడంతో సిబ్బంది తక్కువైనా రాత్రి, పగలు తేడా లేకుండా మొత్తం అధికారులు, సిబ్బంది ఈకేసులో పనిచేస్తున్నారు. ఆస్తులు మొత్తం స్వాధీనం చేసుకొని వేలం వేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక ఉమ్మారెడ్డి గుంటలోని 10వ వీధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఆ ప్రాంత చిన్నారుల కోసం అంగన్‌వాడీ ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని సిపిఎం, డివైఎఫ్ఐ రూరల్ కమిటీలు కోరాయి. మంగళవారం రూరల్ నియోజకవర్గ పరిధిలో గడపగడపకు వైసిపి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 21వ డివిజన్ రవీంద్రనగర్ ప్రాంతంలో రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా సిపిఎం రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కిన్నెర కుమార్ ఆధ్వర్యంలో సిపిఎం, డివైఎఫ్ఐ కార్యకర్తలు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన రూరల్ ఎంఎల్ఎ ఈ ప్రాంతంలో అంగన్‌వాడీ పాఠశాల నిర్మాణానికి కృషి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. 21వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి పోతురాజు శ్రీనివాసులు, 20వ డివిజన్ సిపిఎం కార్యదర్శి నల్గొండ రామయ్య, డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి కండే కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు డబ్బు గుంట శ్రీనివాసులు, మనీ, శ్రీనివాసులు, అయోధ్య ఉన్నారు.

ఎంఎల్ఎ కోటంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓట్ల నమోదులో అక్రమాలను అరికట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాలో నూతనంగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసే విధానంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో డిఆర్ఓ సి. వెంకటనారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎం.మోహనరావు, మధ్య తరగతి ఉద్యోగ సంఘాల కన్వీనర్ ఆర్.నగేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.దయాకర్ కలెక్టరేట్‌లో డిఆర్ఓను కలిశారు. ఈ సందర్భంగా ఎం .మోహన్ రావు మాట్లాడుతూ టీచర్ ఎంఎల్‌సి అధికార పార్టీ అభ్యర్థి నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాలయాలలోని ప్రయివేటు బోధనా సిబ్బందిని అనర్హులైన వారిని ఓటర్లగా నమోదు చేయించారన్నారు. పట్టభద్రులు ఓటర్ల నమోదులోనూ బోగస్ సర్టిఫికెట్లతో నమోదు చేయించారన్నారు. బిఎల్‌ఒలు సక్రమమైన వెరిఫికేషన్ లేకుండానే ఓటర్ లిస్టులో చేర్చారన్నారు. వీటన్నింటిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రభుత్వం పోలింగ్ కేంద్రాల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించిందన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 2000 ఓట్ల నుంచి నాలుగు వేల ఓట్లు ఉన్నాయని ,ప్రతి 1000 ఓట్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించాలి : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు :తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులతోపాటు క్రీడల్లోనూ ఆసక్తికలిగే విధంగా ప్రోత్సహించాలని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, జిల్లాస్థాయి అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రాష్ట్ర స్థాయి సీఎం కప్-2022 పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ సత్తా చాటి జిల్లా కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని మంత్రి పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక దఢత్వానికి క్రీడలు ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమని, పిల్లలందరూ ప్రతిరోజు వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనేలా వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించిన మంత్రి, అధికారులకు క్రీడాకారులు క్రీడాభివందనం చేశారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, డి ఆర్ డి ఎ పిడి సాంబశివారెడ్డి, సెట్నెల్ సీఈవో పుల్లయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటయ్య, ఆర్ వి ఓ వరప్రసాద్, ఇన్చార్జి డీఈఓ సుబ్బారావు, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి,నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కాలువ నర్సం హలాలు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కాకాణి

హమాలీల కూలిరేట్లు పెంచాలి

ప్రజాశక్తి-నెల్లూరు హమాలీ వర్కర్లకు కూలిరేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ హమాలీ కార్మికులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మంగళవారం నెల్లూరు నగరం ప్రధాన వాణిజ్య కేంద్రమైన పప్పుల వీధి, స్టోన్ హౌస్ పేటలో పనిచేయుచున్న హమాలీలు కూలిరేట్లను అగ్రిమెంట్ ప్రకారం సకాలంలో పెంచాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఏఐటియుసి యూనియన్ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు , ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ గడచిన కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, పెరిగిన ధరలకు అను గుణంగా కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్లకు సంబంధం లేకుండా అగ్రిమెంట్ కాలపరిమితిని యాజమాన్యం పెంచడం సరైన చర్య కాదని అన్నారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మంచి పద్ధతి కాదని, తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. రామరాజు,దామా అంకయ్య, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు నాయకులు బి సూర్యనారాయణ, సుధాకర్, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రత్తయ్య పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన చేపట్టిన కార్మికులు

నిందితులు అరెస్టు

నెల్లూరు : కలువాయి మండలంలో చోరీలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి చౌడేశ్వరి వివరాలు వెల్లడించారు. ఆ ముఠా సభ్యులు మొత్తం ఐదుగురు ఉన్నారు. వారిలో కలువాయి మండలం నూతనపల్లి గ్రామానికి చెందిన కండె ప్రసాద్, బుచ్చిరెడ్డి పాళెం మండలం, రామచంద్రాపురం గ్రామానికి చెందిన చెలంచెర్ల పవన్‌కుమార్ , ఆత్మకూరు, జ్యోతినగర్ ప్రాంతానికి చెందిన నళ్లతోటి కుమార్ అలియాస్ మదన్‌కుమార్ పెన్నబద్వేల్ గ్రామం, పెన్నానది ఒడ్డున ఉండే కొండపై ఉన్న వెంకన్నస్వామి ఆలయం వద్ద అను మానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. వారి నుంచి నుంచి 10 సవర్ల డాలర్ ఉన్న బంగారుచైన్, 6 సవర్ల బంగారు చైన్, 3 ఉంగరాలు, రూ.89 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

మాతా శిశుమరణాల నివారణకు చర్యలు

నెల్లూరు : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతా శిశు మరణాలు జరగకుండా నివారించేందుకు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె వి ఎస్ చక్రధర్ బాబు వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతా శిశు మరణాల జిల్లా కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో సంభవించిన మాత శిశు మరణాలకు గల కారణాలను సంబంధిత వైద్యాధికారులు సిబ్బందితో విచారించారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, డిసిహెచ్ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, ఉప డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ప్రియంవద, ఐసిడిఎస్ ఇన్చార్జి పిడి సౌజన్య పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై పరిశీలన

నెల్లూరు :నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలోని సామాజిక, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను అత్యంత ప్రణాళికా బద్ధంగా చేపట్టి ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి నగర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న వివిధ ప్రజా మరుగుదొడ్లను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు ఉన్నారు.

పుస్తకాలు అందజేత

నెల్లూరు :శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సండే మార్కెట్ సెంటర్ దొడ్ల పద్మావతి శాఖ గ్రంధాలయానికి వివిధ రకాల పుస్తకాలను బాహూకరించారు. ఈసందర్భంగా గౌతమ బుద్ధుడు వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అరవ రాయప్ప మాట్లాడారు.గ్రంధాలయానికి వివిధ రకాల 80 పుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ ఉద్యోగి పి.మంజుల, బి.సరళ, నెల్లూరు జిల్లా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ట్రెజరర్ పెసల ధనుంజయ పాల్గొన్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి కార్యాలయంలో జిజిహెచ్‌లో పనిచేస్తున్న డాక్టర్లకు, పారామెడికల్ సిబ్బందికి హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి కార్యాలయంలో ఈ సదస్సు నిర్వహించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి వెంకట ప్రసాద్ మాట్లాడారు

తెగుళ్ల నివారణకు సూచనలు

తోటపల్లిగూడూరు : వరిని ఆశిస్తున్న తెగుళ్లపై అప్రమత్తంగా వుండాలని ఇందుకూరుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎ. రాజ్ కుమార్ సూచించారు. మంగళవారం మండలములోని పాపిరెడ్డిపాళెం, టీపీ గూడూర్ బిట్ 1,మాచర్లవారపాలెం, వరిగొండ బిట్ 2, నరుకురు, పేడూరు, కోడూరు బిట్ 1, బిట్ 2, పొట్లపూడి గ్రామాలలో డాక్టర్ వైస్సార్ పొలం బడి కార్యక్రమాలు జరిగాయి. మండల వ్యవసాయ శాఖ అధికారి గీతాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ఏడి రాజ్ కుమార్ హాజరయ్యారు.

కౌన్సెలింగ్ వాయిదా

నెల్లూరు :వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న సిబ్బందిని వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లకు బదిలీ చేసేందుకు కోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన తరువాతనే కౌన్సిలింగ్ నిర్వహిస్తామని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం ఎపిఎన్ జీ ఓస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి. పెంచలరావు, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో డిఎంఅండ్‌హెచ్‌ఓను కలిసారు. ఉన్న ఇబ్బందులను వారు వివరించారు. ఈ సమస్యపై డిఎం అండ్‌హెచ్‌ఓ ఉన్నతాధికారులను సంప్రదించి కౌన్సిలింగ్ ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు యన్. గిరిధర్,ఆర్గనైజింగ్ కార్యదర్శి జీ.రమేష్ బాబు, ఉపాధ్యక్షులు యన్. ఆంజనేయ వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని ఇస్కపాలెం గ్రామంలో గల ప్రభుత్వ బి. సి బాలుర వసతి గహంలోని విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఎంబేటీ శేషమ్మ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సహాయ బి సి సంక్షేమ శాఖధికారి కె. ప్రసూన, వసతి గహ సంక్షేమ అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-నెల్లూరు :మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వం అందజేయాలని, ప్రజలపై భారాలను మోపే సంస్కరణలను విరమించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రెండో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు సుజాతమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పట్టణ ప్రజలపై భారాలు మోపే సంస్కరణలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మున్సిపల్ కార్మికులకు సంబం ధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఆప్కాస్ పేరుతో 60 ఏళ్ల పైబడి పనిచేస్తున్న కార్మికులను ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా అర్ధాంతరంగా తొలగించడం దుర్మార్గమన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే డ్రైవర్స్, ఇతర సిబ్బందికి హెల్త్ అలవెన్స్‌లు అందజేయడం లేదన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు పేరుకుపోతున్నా యన్నారు. కార్మికుల ఖాతాలో జమ కావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల యొక్క సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి. ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ కత్తి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లాడి గోపాల్, కావలి, నెల్లూరు నగరం, రూరల్, కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటి యు అనుబంధం) రెండవ మహాసభ అనంతరం జిల్లా నూతన కమిటినిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 27 మందితో నూతన కమిటీ, 9 మందితో ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా జి.కామక్షమ్మ, కార్యదర్శిగా కె.పెంచలనర్సయ్య ఆఫీస్ బేరర్స్ గా ఎం అశోక్, ఏ దేశమూర్తి, సుజాతమ్మ, వజ్రమ్మ, టి సీనయ్య, సునీల్ చెన్నయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెంచలనర్సయ్య (కార్యదర్శి) జి కామాక్షమ్మ (అధ్యక్షులు)

పునరావాస కాలనీ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలంలోని రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు సంబంధించి నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో చేపట్టాల్సిన మౌలిక సదు పాయాలను, గహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలనికలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారంకలెక్టర్ చక్రధర్ బాబు, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, రామాయపట్నం పోర్టు ఎమ్‌డి శ్రీ ప్రతాప్ రెడ్డి లతో కలసి రామాయపట్నం పోర్టు పరిధిలోని నిర్వాసిత గ్రామాలైన మొండివారిపాలెం, రావులవారిపాలెం గ్రామాలకు సంబంధించి నిర్మిస్తున్న ఆర్. అండ్ ఆర్ కాలనీని సందర్శించారు.భూ సేకరణ ప్రక్రియ పురోగతి తదితర అంశాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, అధి.కారులతో కలసి పోర్టు నిర్మాణ పనులను పరిశీలించి, పోర్టు నిర్మాణ పనుల ను వేగవంతం చేయాలని పోర్టు అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట రామాయపట్నం పోర్టు లైజనింగ్ అధికారి ఐ.వి.రెడ్డి, భూసేకరణ డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ పద్మావతి, తహశీల్దార్ లావణ్య పాల్గొన్నారు.

పురుగు మందులను నియంత్రించాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :పొగాకు పంటలో పురుగు మందులు, ఎరువులు సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే వాడాలని కందుకూరు పొగాకు బోర్డు సూపరింటెండెంట్ రాజగోపాల్ రైతులకు సూచించారు. మండలంలోని కూనిపాలెం, నలదలపూరు గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షేత్రాధికారి హర్ష, ఐటిసి మేనేజర్ సునీల్‌కుమార్, జిపిఐ ప్రతినిధి శ్రీనివాసరావు, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు

ప్రజాశక్తి -కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్ఈసి గ్రూపు పూర్తి చేసుకుని ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థి కేతినేని కొండలరావు హ్యాండ్ బాలు పోటీలలో జాతీయస్థాయి సర్టిఫికెట్ పొందారు. నెల్లూరులో సెప్టెంబర్‌లో జరిగిన ఆర్మీ ర్యాలీలో పాల్గొని క్రీడాకోటాలో ఆర్మీలో ఉద్యోగం సాధించారు. టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థి కొండలరావుకు మంగళవారం అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కదిరి నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ తొట్టెంపూడి సుబ్బారావు, ఆద్యాపకుడు బివి కాశీ రత్నం, రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థి కొండలరావు పిడి సుబ్బారావు, ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావుకి కతజ్ఞతలు తెలిపారు.

ముస్లిముల స్కాలర్‌షిప్‌లు రద్దు సరికాదు

ప్రజాశక్తి -కందుకూరు : కేంద్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు అందించే ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ లను ఒకటో తరగతి నుండి 8వ తరగతి వరకు చదివే వారికి రద్దు చేయటం దుర్మార్గమని మాజీ మునిసిపల్ కౌన్సిలర్ షేక్ ఖాదర్ బాష ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే మైనారిటీ వర్గాలకు ఉపాధి లేక వచ్చే కొద్దిపాటి స్కాలర్ షిప్లతో చదువులు సాగిస్తున్న మైనారిటీ వర్గాలకు ఆ చదువులు కూడ అందకూడదనే దురాలోచంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుందన్నారు.

కొనసాగిన చేవూరు గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి -కందుకూరు : గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం సర్వే బందాన్ని రైతులు అడ్డుకున్నారు. గ్రామ సచివాలయం వద్ద భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి వేంకటేశ్వరు మాట్లాడుతూ ప్రత్యేక సబ్ కలెక్టర్ సోమవారం రైతులతో మాట్లాడుతూ డిసెంబర్ 5వతేది గ్రామ సభ తరువాత సర్వే చేస్తామని చెప్పి మంగళవారం సర్వే అధికారులను పంపడం సరికాదన్నారు. రైతులకు న్యాయం చేయాలన్నారు. మాజీ మండల అధ్యక్షులు పొటేళ్ళ మురళి, ఎస్ వేంకటేశ్వర్లు, ఇ బ్రహ్మయ్య, హరిబాబు, పిచ్చయ్య, రాజగోపాల్, శ్రీనివాసులు, శివాజి, లెళ్ళపల్లి అంకయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివద్ధి పనులను స్వయంగా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు మున్సిపా లిటీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికు లను పర్యవేక్షణకు నియమించగా వారిని కాంట్రాక్టర్లు లెక్కచేయకుండా ఇష్టానుసారం పనులు చేశారు. ఫలితంగా నెలరోజులకే పనుల్లో నాసిరకం బయటపడి సిమెంట్ రోడ్లు దెబ్బతిన్న విషయం ప్రజాశక్తి పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఏఈ జీ లోకేష్ పట్టణంలోని కష్ణుని దేవాలయం వద్ద నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

కందుకూరు :చేయి చేయి కలుపుదాం.. ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాంఅనే నినాదంతో కందుకూరు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కందుకూరు మండలం పాలూరు డా.కె.మాలకొండయ్య, శాంతా దేవి దంపతుల సహకారంతో పట్టణ వీధుల్లో ఉండే పేదలకు, నిరాశ్రయులకు విప్పగుంట రోడ్డులో మార్కెట్ యార్డు గోడ పక్కన నివాసం ఉంటున్న పేద వారికి రగ్గులు మంగళవారం పంపిణీ చేవారు. ఎల్ఐసి ఏజెంట్ యాదాల శ్రీనివాసరావు మాట్లాడారు. శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, మణికంఠ గార్మెంట్స్ అధినేత చీదెళ్ల కృష్ణ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు ముఖ్యం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :రైతులకు మేలు జరిగే విధంగా బ్యాంకుల రుణ పరిమితులు నిర్ధారించాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు.డిసిసి బ్యాంకు సీఈవో శంకర్ బాబు, జనరల్ మేనేజర్ సరిత, బిజిఎం దయాకర్ రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్ కుమార్, డిడిఎం రవి సింగ్, డి సి ఓ తిరుపాల్రెడ్డి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి , రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కోటిరెడ్డి పాల్గొన్నారు.

'ఆవాజ్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : ఆవాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ఆవాజ్ వ్యవస్థాపక నాయకులు షేక్ రియాజ్‌ను జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆవాజ్ ఆవిర్భవించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సౌజన్యం తో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ మైనారిటీల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ, జిల్లా కమిటీ సభ్యులు మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నెల్లూరు : ఆత్మకూరు పట్టణంలో డిసెంబరు 11,12 తేదీలల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సిఐటియు 11 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు నిచ్చింది. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి రాజా, సురేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే సిఐటియుజిల్లా మహాసభలలో చర్చిస్తామన్నారు. ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి రాజా సహాయ కార్యదర్శి ఎం సుధాకర్ ట్రెజరర్ సిహెచ్ వెంకయ్య జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే హమీద్ పి మురళి ఊటుకూరు హరిబాబు ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

తోటపల్లిగూడూరు :ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముసునూరి శైలజ హెచ్చరించారు. మండల సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం కన్వెర్జెన్స్ సమావేశం జరిగింది. పశుసంవర్ధక శాఖ ఏడి మురళీ కష్ణ, కోడూరు, ఈదూరు, తోటపల్లిగూడూరు పశువైద్యులు వసంత రాయులు, శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఎపిఎం మాట్లాడుతూ సంఘబంధాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలులో విఓఏలు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు (సీసీ) అవినీతి అక్ర మాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయన్నారు. వీటిపై ప్రత్యేక దష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటామని శైలజ స్పష్టం చేశారు. పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ఏడి మురళీ కష్ణ వివరించారు.

మాట్లాడుతున్న ఎపిఎం శైలజ

బిటిఎ సమావేశం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు డివిజన్ బిటిఎ సమావేశం స్థానిక బిటిఎ జోనల్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. 'జ్యోతిబాపూలే 132వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పొన్నలూరు మండల బిటిఎ అధ్యక్షులు కె అంజయ్య అధ్యక్షత వహించారు., బిటిఎ జోనల్ అధ్యక్షుడు ఎస్‌కె. అబ్దుల్లా మాట్లాడారు. రమణ య్య, డి కోటేశ్వరరావు, జి మాల్యాద్రి, డి రామమోహన్, కె కొండల రావు, కె యలమందయ్య పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి : టిడిపి

ప్రజాశక్తి -కందుకూరు : వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల ఆర్‌టిఎస్ సమావేశం కావలిలో మంగళవారం జరిగింది. స్థానిక పార్టీ ఇన్‌ఛార్జి మాలెపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీ నరసింహం, నార్నె రోశయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి

శ్మశాన వాటిక ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-కోవూరు : మండల పరిధిలోని గుమ్మళ్ల దిబ్బలో ముస్లిములకు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు చాన్‌బాషా, ఎస్‌కె బాబు తెలిపారు. సోమవారం స్థానిక సీతాపోలయ్య భవనంలో ఆయన మాట్లాడారు. 150 ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నారు వారికి శ్మశాన వాటిక లేదన్నారు. ఎవరైనా ముస్లిములు చనిపోతే మూడు కిలోమీటర్లు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలం వస్తే కలుజు వద్ద ఎక్కువ శాతం నీరు ఉంటుందన్నారు. మృతిచెందిన వారిని పది కిలోమీటర్ల చుట్టూ తిరుగుకొని కోవూరుకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ముస్లిములకు శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై బుధ, గురువారాలలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసులు తెలియజేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అందరూ ఎంపిడిఒలు, విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు శిక్షణలో పాల్గొంటారన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికలు 2023-24 సంవత్సరానికి ఏవిధంగా తయారు చేయాలో ఈ శిక్షణలో వివరంగా నెల్లూరు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు తెలియజేస్తారన్నారు.

గణేష్‌కు నేషనల్ అవార్డు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో జాతీయస్థాయిలో బంగారు పతకాన్ని ట్రోఫీని ఆత్మకూరు పట్టణానికి చెందిన సాయి.వెంకట గణేష్ కైవసం చేసుకున్నారు. కరుటంపాడు 'హైస్కూల్' ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసులు తనయుడైన ఈ చిన్నారి వెంకటగణేష్ చెన్నైలో జరిగిన ఈ టోర్నమెంట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోటీదారులను ఓడించి తన ప్రతిభతో నేషనల్ గోల్డ్ కప్ ఛాంపియన్‌షిప్ అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం ఈ బాలుడికి అభినందన సభ ఏర్పాటు చేస్తారని తెలిపారు. గతనెలలో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంటులో ప్రథమస్థానం పొంది రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు.

గ్రంథికి సోమిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-కావలి : పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గ్రంధి యానాదిశెట్టిని మంగళవారం వారి నివాసంలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరామర్శించారు. కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, పోతుగంటి శ్రీకాంత్, తటవర్తి వాసు, శానం హరి, జంపాని ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండ్రెడ్డి నాగిరెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-కావలి : విట్స్ ఇంజనీరింగ్ కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండ్రెడ్డి నాగిరెడ్డికి నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య పర్యవేక్షణలో నాగిరెడ్డి సమర్పించిన "ఇంపాక్ట్ ఆఫ్ బ్యాంకింగ్ సెక్టార్ రిఫామ్స్ ఆన్ ది పెర్ఫార్మెన్స్ ఆఫ్ కో - ఆపరేటివ్ బ్యాంక్స్ ఇన్ ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్.ప్రభాకర్, యూనివర్సిటీ కళాశాల కావలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు, కమర్స్ విభాగ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అభినందన సభలో విట్స్ కళాశాల చైర్మన్ డి.విద్యాధర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ శర్మ, ప్రొఫెసర్ సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనాథ్‌రెడ్డి, వి.వి.సునీల్ కుమార్, కళాశాల విభాగ అధిపతులు, సహ అధ్యాపకులు నాగిరెడ్డిని ఘనంగా అభినందించారు.

పేదలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు పట్టణం నివాసులు కె.శ్రీనివాసరావు ఎన్‌సి లలిత దంపతులు వారి కుమారుడైన జై సాయి దాం భావన్ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో బుడంగుంట గిరిజన ప్రాంతంలో 150మందికి బిర్యానీ, స్వీట్స్ అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకుమారుడు జై సాయి దాం భావన్ జ్ఞాపకార్థంగా ఎనిమిది సంవత్సరాల నుండి ప్రతి నెల 29 తేదీన పేదలకు ఆకలి తీర్చడం జరుగుతూ ఉందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, దాతలు కె.శ్రీనివాసరావు - ఎన్ సి లలిత దంపతులు, దాత కుటుంబ సభ్యులు సైలా మమత పాల్గొన్నారు.

రాష్ట్రంలో మాఫియాను ప్రోత్సహిస్తున్న వైసిపి

ప్రజాశక్తి-కొడవలూరు : రాబోయే ఒకటిన్నర సంవత్సరంలో ప్రతిఒక్కరు కష్టపడి కోవూరు నియోజకవర్గంలో పోలంరెడ్డి దినేష్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేలా టిడిపి అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని టిడిపి మండల కన్వీనర్ కోఠంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని నార్త్ రాజుపాలెం స్వగృహ కల్యాణమండపంలో నియోజకవర్గస్థాయి టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో టిడిపి నాయకులు చెముకుల కృష్ణచైతన్య, వీరేంద్ర చౌదరి, చెముకుల శ్రీనివాసులు, ఇంతా మల్లికార్జున రెడ్డి, చక్కా మదన్‌మోహన్, మైనార్టీ నాయకులు షిమామ్ బాషా, నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

బైక్ దగ్ధం

ప్రజాశక్తి-కోవూరు : బుచ్చిరెడ్డిపాలెం మండలం, నగర పంచాయతీ పరిధిలోని జొన్నవాడ సెంటర్ వద్ద బైక్ దగ్ధమైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... ఇద్దరు వ్యక్తులు పనిపై జొన్నవాడ సెంటర్‌కు వచ్చి బైక్ పార్క్ చేశారు. వచ్చిన పనిని చూసుకొని వెళ్లేందుకు బైక్ యాజమాని సెల్ఫ్ స్టార్ట్ చేయగా ఒక్కసారిగా బైక్ నుంచి మంటలు పెద్ద ఎత్తున రేగాయి. ఒక్కసారి మంటలు రావడంతో బైక్ పై ఉన్న వ్యక్తి ఏం జరిగిందో అని బైక్ ను వదిలేసి దూరంగా వెళ్లిపోయాడు. దీని గమనించిన స్థానికులు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా మంటలను ఆదుపు చేశారు.

శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

ప్రజాశక్తి-సీతారామపురం : వైఎస్ఆర్ చేయూత ద్వారా లబ్ధి పొందిన వారిని క్షేత్రస్థాయిలో పరిశీలనకు పశుసంవర్ధక శాఖ, డిఆర్‌డిఎ శాఖలు సమన్వయంగా పనిచేయాలని డిఆర్‌డిఎ వెలుగు ఏపిఎం బిడ్డుల సుధాకర్ రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో పశు వైద్యాధికారిని అనుషతో కలిసి ఇరు శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూతకు సంబంధించి పశుసంవర్ధక శాఖ వైఎస్ఆర్ కెపి సిసిలు విఒఎలు లబ్ధిదారుల పరిశీలనకు సమన్వయంతో వెళ్లాలన్నారు. పాడుపు సంఘాల ద్వారా స్త్రీ నిధి, సిఐఎఫ్ బ్యాంకు లింకేజీ, ఉన్నతి అంతర్గత రుణం ద్వారా రుణం తీసుకున్న వారిని పరిశీలించడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని చెలిక సంఘం గ్రామానికి చెందిన యాటగిరి నారాయణమ్మ(56) చేవూరు వరదయ్య(47) అనే ఇద్దరు వృద్ధులు దగదర్తి మండలం సున్నపుబట్టి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి అంత్యక్రియల కోసం మంగళవారం కెవిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుటుంబాలకు తోడ్పాటుగా ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అల్లిమడుగు కాలనీకి చెందిన కొండ వెంకటేశ్వర్లు (76) అనే వృద్ధ అనారోగ్యంతో మరణించగా రూ.3 వేలు, ప్రీజరు ఏర్పాటు చేశామని ట్రస్ట్ నిర్వాహకులు సుఖవల్లి జోసెఫ్ పేర్కొన్నారు.

'బిఎస్ఆర్'లో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని బిఎస్ఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ టి.శివశంకర్ జన్మదిన సందర్భంగా ఆత్మకూరు లైన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో బిఎస్ఆర్ హాస్పిటల్‌లో రోగులకు దుప్పట్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. . లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, వారి సహకార సభ్యుల ఆధ్వర్యంలో అనంతరం కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వెంట శ్రీనివాసులు, సెక్రటరీ ఓమ్మినేని శ్రీనివాసులు, ట్రెజరర్ శ్రీనివాసులు, లైన్స్ క్లబ్ సభ్యులు తదితరులున్నారు.

జనసేన విజయానికి కృషి చేద్దాం..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ప్రతిపక్ష అభివృద్ధి చెందాలంటే మనమందరం పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిని చేయాలని జనసేన పార్టీ నెల్లూరు జిల్లా నాయకుడు నలిశెట్టి శ్రీధర్ అన్నారు. మంగళవారం పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి చేయాలన్న దృఢ సంకల్పంతో, ప్రజల ఆశీర్వాదంతో కొనసాగుతున్న పవన్నన్న ప్రజాబాట కార్యక్రమం, మంగళవారం 28వ రోజుకు చేరుకుంది. పవన్నన్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ మున్సిపల్ పరిధిలోని, లక్ష్మణరావు పల్లి, బంగ్లా సెంటర్, ఎస్.టి కాలనీలలో పర్యటించి అక్కడి ప్రజల ఇబ్బందులను తెలుసుకొని జనసేన పార్టీ తరఫున తన వంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు జనసేన నాయకులు వంశీ, చంద్ర, నాగరాజు, భాను, గణేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని మంచుపాలెంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన మాలధారుల సమక్షంలో అయ్యప్ప స్వామికి సకల పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో గ్రామం పులకించింది. గ్రామానికి చెందిన మాలధారుల యలగాల వెంకటేశ్వర్లు, తోకా రమణయ్య, కోట విజయ్ భాస్కర్‌రెడ్డి, యలగాల చిట్టి, శ్రీనివాస్‌ఉల్లి, శ్రీనివాసులు, యలగాల మాలకొండయ్య, బాలిరెడ్డి శివారెడ్డి,దుప్పూరు నితీష్, మహేష్, సుబ్బయ్యోయిన సుమన్, నాగరాజు, పూసపాటి బద్రి, తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

విడవలూరులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-విడవలూరు

డిసెంబర్ 8, 9, 10 తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య కోరారు. విడవలూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు అమలు చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనులు 200 రోజులు పని దినాలు కల్పించాలని కూలీల పని దినాలతోపాటు కూలీలు గానీ పెంచాలన్నారు. గతంలో ఇవ్వాల్సిన బాధ్యులను వెంటనే చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు ప్రభుత్వ భూములు పంచి పెట్టాలని కూలీలకు రూ.500 పింఛను కానీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలాలు పండించిన పంటకు చివరకు గిట్టుబాటు ధర లేకుండా దగా చేస్తున్నారని తెలిపారు. ఎరువుల రేట్లు తగ్గించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రైతు నాయకుడు తుళ్లూరు గోపాల్, ఏడుకొండలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్య.కా.సం. మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కోవూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కోవూరు : ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ డిసెంబర్ 8, 9,10వ తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో జరుగుతుందని వ్య.కాస.జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమ రాజు, మంగల పుల్లయ్య తెలిపారు. మంగళవారం సీతాపోలయ్య భవనంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా నాయకులు విజయ రాఘవన్, బందా కరాత్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్య.కా.సం. రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, శాసనమండలి సభ్యులు, వెంకటేశ్వర రావు, సాబ్జి, తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్య.కాసం. మండల కార్యదర్శి బి.పెద్దబ్బయ్య, అధ్యక్షులు విజయ కుమార్, రైతు సంఘం నాయకులు శేషయ్య, సుబ్బరావు, కాలేషా, జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట

ప్రజాశక్తి-సంగం

భవిష్యత్తు తరానికి ఇచ్చే విలువైనది ఒక్క చదువు మాత్రమే అన్న మాటకు కట్టుబడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన సంగంలోని గురుకుల కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాలకు విచ్చేసిన ఎంఎల్‌ఎకు విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేస్తూ ఘనస్వాగతం పలికారు. అనంతరం కళాశాలలోని భోజనశాలను ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి విద్యార్థులకు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని అందించారు. అనంతరం వారితోనే సహపంక్తి భోజనం చేస్తూ తన బాల్య విశేషాలను పంచుకుంటూ భోజనం చేశారు. భోజనం అనంతరం కళాశాలలోని తరగతి గదులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఐఐటి, ఎంబిబిఎస్ లాంటి ఉన్నత కోర్సులతో పాటు అన్ని రకాల కోర్సులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నార న్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను సద్వినియోగం చేసుకుని చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తుకు బంగారు బాట చదువతోనే సాధ్యమని వారికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల కళాశాల విద్యార్థులందరితో కూర్చుని సెల్ఫీ తీసుకుని వారందరికి చదువుల్లో, ఆటపాటల్లో రాణించాలంటూ ప్రోత్సహించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

రక్తదాన ప్రచారం కోసం పాదయాత్ర

కిరణ్‌వర్మను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి : 2025 సంవత్స రం నాటికి భతదేశంలో రక్తం దొరకక ఎవరూ మరణించ కూడదనే లక్ష్యంతో పాదయాత్ర చేస్తున్నట్లు ఢిల్లీకి చెందిన కిరణ్ వర్మ తెలిపారు. రక్తదాన ప్రచారం కోసం 21వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిన కిరణ్ వర్మను మంగళవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ వర్మ మాట్లాడుతూ తాను మయాంక్ అనే 12 సంవత్సరాల క్యాన్సర్ బాధితుడు సకాలంలో ప్లేట్లెట్స్ దొరకక చనిపోవడం చూసి, రక్తదానంపై అవగాహన కల్పించాలని, భార్యాబిడ్డలను వదలి పాదయాత్ర చేపట్టానన్నారు. కేరళలో పాదయాత్ర ప్రారంభించి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణాలలో పాదయాత్ర ముగించానని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్నానని తెలిపారు. రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ భారతదేశంలో అవసరమైన రక్తంలో 60 శాతం మాత్రమే స్వచ్ఛంద రక్తదాతల నుండి సమకూరుతుందనీ, అందువల్ల ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. కిరణ్ వర్మ చేపట్టిన పాదయాత్ర లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డి.రవిప్రకాశ్, డి.సుధీర్‌నాయుడు, జి.ప్రసన్నాంజనేయులు, డాక్టర్ టి.కృష్ణారావు, డాక్టర్ నక్కా రేవంత్, డాక్టర్ నక్కా రమ్య, ఎ.జె.మల్లేశ్వరరావు, నల్లిపోగు ప్రణీత్, బి.ఎస్.ప్రసాద్, అభిసాగర్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లామ్ ఫారం గుంటూరు ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సంయుక్తంగా అగ్రిటెక్ -2022ను యూనివర్సిటీ ప్రాంగణంలో 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంసి ఓబయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ అగ్రిటెక్-2022 కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై సదస్సు, ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వ్యవసాయంపై అధికారుల సందేశాలు, వివిధ అంశాలపై శాస్త్రవేత్తల సందేశాలు, పంటల ఉత్పత్తి, సస్య రక్షణలో ఆధునిక విధానాలు పర్యావరణ సహిత వ్యవసాయానికి సహజ వనరుల పరిరక్షణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆహార ఇంజినీరింగ్‌లో వినూత్న సాంకేతిక పరిజ్ఞాలపై ప్రదర్శన, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతులందరూ విరివిగా ఈ అగ్రిటెక్ 2022 సదస్సులో, ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయలని కోరారు.

చెన్నూరు రోడ్డులో అఖిలపక్షం పరిశీలన

కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి-కోవూరు

బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని బుచ్చి చెన్నూర్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులలో భాగంగా జరుగుతోన్న డ్రెయినేజీ పనులను అఖిలపక్ష నాయకులు పరిశీలించారు. 50 రోజుల క్రితం సెంట్రల్ లైటింగ్ కోసం సమగ్ర సర్వే లేకుండా అధికారులు ప్రయివేటు వ్యక్తులతో సర్వే నిర్వహించి ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేయడంపై బుచ్చి మండల అఖిలపక్షం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా చెన్నూరు రోడ్డులో ధ్వంసమైన ఆస్తులను వారు పరిశీలించి. అనంతరం అఖిలపక్ష నేతలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి ర్యాలీగా బయలుదేరి బుచ్చి తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కు, మున్సిపల్ కార్యాలయంలో నగర కమిషన్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ చెన్నూరు రోడ్డు సెంట్రల్ లైటింగ్ పేరుతో పెద్ద ఎత్తున కుంభకోణం జరుగుతుందని పంచాయతీ పరిధిలోని ప్రజలను వ్యాపారస్తులను భయ భ్రాంతులకు గురిచేస్తూ, అక్రమ కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ఎంబి ప్రకారం అధికారులు రోడ్డువిస్తరణ చేయాలని గాని, ప్రయివేటు కాంట్రాక్టర్లు, జెసిబి ఆపరేటర్లు రోడ్డు విస్తరణ చేయడం ఏమిటా అని వారు ప్రశ్నించారు. బుచ్చిరెడ్డిపాలెం అధికారులకు రోడ్డు విస్తరణ పనులు చేతకాక "షాడో కమిషనర్" ను ఏర్పాటు చేసి వారి ఇష్టారాజ్యంగా రోడ్డు విస్తరణ పనులు చేయడంపై పెద్ద కుట్ర జరుగుతుందని దీనివల్ల వ్యాపారస్తులు భవన యజమానులు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని వారు అన్నారు. వారం రోజుల్లోగా సమగ్ర సర్వే జరిపి రోడ్ల విస్తరణ చేయాలి లేకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.వి.శేషయ్య, నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, బత్తల హరికృష్ణ, బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులు, సిపిఎం నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, జనసేన నాయకులు మాధవరావు, తుమ్మల ప్రసాద్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై వేధింపులు

ప్రజాశక్తి-కావలి

కొండాపురం మండలం వెలిగండ్ల లో అధికార పార్టీ వైసిపి నేత, సర్పంచ్ కుమారుడు బొట్లపాటి రమేష్, విఆర్ఒ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శీలం మాల్యాద్రిరెడ్డిలు వేధిస్తున్నట్లు ఆ గ్రామానికి చెందిన దళిత మాజీ సర్పంచ్ కొరివి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. పూర్వీకుల నుంచి వస్తున్న, రిజిస్టర్ స్థలమైన తన ఇంటి స్థలంలో నుంచి దౌర్జన్యంగా బాట వేస్తున్నట్లు తెలిపారు. అధికారులకు ఎవరికి చెప్పినా న్యాయం జరగలేదని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కోర్టు ఎవరూ తన స్థలంలో దిగవద్దని స్టే ఇచ్చినట్లు చెప్పాడు. అయినా స్థానిక విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి సహకారంతో సర్పంచి కుమారుడు రమేష్ పంచాయతీ నిధులతో రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఇంటి స్థలంలో వారు పెంచుకున్న చెట్లును ధ్వంసం చేసి బాటగా చేశారన్నారు. ఈ సమయంలో తాను ఇంటిలో లేకపోవడంతో అడ్డుపడిన తన భార్యలతో విఆర్ఒ దురుసుగా మాట్లాడడని తెలిపారు. కోర్టు ఆర్డర్ ఉందని చెప్పినా ఇలాంటివి ఎన్నో చూశామని, పెద్ద పెద్దవే కూలుతున్నాయని, చాలా వ్యంగంగా మాట్లాడారని చెప్పారు. న్యాయం చేయాలని స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేయగా కనీసం కన్నెత్తి చూడలేదన్నారు. తాను టిడిపి పార్టీలో ఉండడం, ఎస్‌సిసెల్ జిల్లా నాయకుడుగా ఉన్నానన్న కక్షతోనే వేధిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోటేశ్వరరావు కోరారు.

'గడపగడప'కు అపూర్వ ఆదరణ

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని దాసరపల్లి గ్రామంలో గడపగడపలో మహిళలు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల చేరికపై ముఖ్యమంత్రికి అపూర్వ ఆదరణ చూపుతున్నారని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండల పరిధిలోని దాసరపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంఎల్‌ఎ అడిగి తెలుసుకొన్నారు. గ్రామాల్లో స్థానిక ప్రజలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ గౌస్ మొహద్దీన్, ఎంపిటిసి సుభాన్, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కొల్లుబోయిన కృష్ణ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల వెంగళరెడ్డి, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ గడియాల్చి యస్దాని, మాజీ సర్పంచ్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గానుగపెంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీను, ఇత్తడి రమణయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బాలల హక్కులు-పరిరక్షణ'పై అవగాహన

ప్రజాశక్తి-వెంకటాచలం : కసుమూరులోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో "బాలల హక్కులు-పరిరక్షణ" అంశంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటాచలం సిఐ జి.గంగాధరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 14 సంవత్సరాల వయసు వరకు బాలబాలికలందరికీ ఉచిత విద్యను పొందేహక్కు ఉందని తెలిపారు. అలాగే లైంగిక వేధింపుల నుండి రక్షణ పొందే హక్కు ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నుండి విముక్తి పొందే హక్కు ఉందనీ, ఇంకా పలు రకాల చట్ట పరమైన రక్షణ బాలలకు ఉందన్నారు. అయితే ఈ హక్కులను దుర్వినియోగం చేయరాదనీ వాటి ఆలంబనతో బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.వి.శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వాహనాలు వేలం

ప్రజాశక్తి బిట్రగుంట : బిట్రగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. వేలందారులు పాల్గొని వారు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు తప్పనిసరిగా ఒరిజినల్ తీసుకొని రావాలన్నారు. వాహనానికి సంబంధించి నిర్ణయించిన ధర ప్రకారం 10 శాతం ముందుగానే ఫీజు కట్టవాలని తెలిపారు. హీరో హోండా ఫ్యాషన్ 3 వాహనాలు, అప్పి ఆటోలు మూడు, పల్సర్ 150 సిసి వాహనాలు ఉన్నాయని, ఉదయం 10 గంటలకు పాల్గొనాలన్నారు.

టిడిపి గెలుపునకు కృషి చేయాలి

మాట్లాడుతున్న టిడిపి జాతీయకార్యదర్శి బీద రవిచంద్ర

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గంలో సమర్థుడైన నాయకుడు మాలేపాటి సుబ్బా నాయుడును టిడిపి అభ్యర్థిగా గెలిపించుకోవాలని, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడును సిఎంగా చేసుకునేందుకు ప్రతి టిడిపి కార్యకర్త కషి చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపు నిచ్చారు. మంగళవారం పట్టణం లోని ఎమ్.జి.ఆర్. కళ్యాణమండపంలో కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల ఆర్.టి.ఎస్. ట్రైనింగ్, "ఇదేమి ఖర్మ రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్ర పటానికి టిడిపి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆలా అని కష్టపడ కుండా గెలవడం కుదరదన్నారు. ప్రతి కార్యకర్త అహర్నిశలూ శ్రమించి, పార్టీ గెలుపునకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులు గా ఆయనతోపాటు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, కావలి నియోజక వర్గం ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్, తాళ్లపాక అనురాధ, గుంటుపల్లి శ్రీదేవి, కొండూరు పోలిశెట్టి పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, అనుబంధ విభాగ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, డివిజన్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, ముఖ్య నేతలకు ఆర్.టి.ఎస్. విధివిధానాలపై ట్రైనింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-దగదర్తి : రోడ్డు ప్రమాదంలో ఏటగిరి నారాయణమ్మ (62) చేవూరు వరదయ్య (47) అనే వ్యక్తులు మృతి చెందిన ఘటన రాచర్లపాడు-సున్నపుబట్టి జాతీయ రహదారిపై మంగళవారం వేకువ జామున చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో వెంటనే ఘటన స్థలానికి డి.ఎస్.పి వెంకటరమణ, సిఐ రాజేష్, దగదర్తి ఎస్ఐ సుమన్ చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అల్లూరు మండలం సింగపేట పంచాయతీ చెందిన చెలికె సంఘం చెందిన భవాని, అయ్యప్ప మాలలు ధరించిన స్వాములు కోవూరులోని చంద్రమౌళి నగర్ పూజకి ఆటోలో వెళ్లి తిరిగి వచ్చే సమయంలో సున్నపుబట్టి సమీపం వచ్చేసరికి నెల్లూరు నుంచి కావలి వైపు వెళు న్న కంటైనర్ లారీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టిందన్నారు. ఒక్కసారిగా బోల్తాపడడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 18 మంది స్వాముల్లో ఇద్దరు మృతి చెందారని, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన వారిని వెంటనే కావలి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. మతి చెందిన వ్యక్తులను పోస్టుమార్టం నిమిత్తం కావలికి తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వారు తెలిపారు.

2న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి

డిసెంబర్ 2వ తేదీన మండల సర్వసభ సమావేశం ఎంపిపి మూలే పద్మజ వినయ్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని మంగళవారం ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరుగుతుందన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా వ్యవసాయ పంచాయతీ రాజ్ గృహ నిర్మాణ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అనంతరం అధ్యక్షుల అనుమతితో ఇతరవిషయాలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

స్థల వివాదంపై ఆరోపణలు సరికాదు

- 29వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సత్తార్

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని చాణిక్యపురిలోని స్థల వివాదంపై తనపై చేసిన ఆరోపణలు సరికాదని, అవన్నీ అసత్యాలని 29వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సత్తార్ ఖండించారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మస్తాన్‌బి అనే మహిళ తనపై చేసిన ఆరోపణలు సరికాదని, అందుకు స్థలానికి సంబంధించిన పత్రాలను విలేకరులకు చూపిస్తున్నట్లు తెలిపారు. మస్తాన్‌బి అమ్మ బిబిజాన్ ఆ స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ స్థలాన్ని వారి పిల్లలకు రాసిచ్చినట్లు తెలిపారు. వాస్తవంగా ఆ స్థలం బిబిజాన్ కొన్నప్పుడు 8 అంకణాలు పట్టా అయితే 30 అంకణాల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఆ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులకు అమ్మి, దానికి అనుసంధానంగా ఉన్న రోడ్డును కూడా ఆక్రమించి అమ్మాలని ఆలోచన చేసినట్లు తెలిపారు. అది సరైన నిర్ణయం కాదని మాత్రమే చెప్పానన్నారు. ఈ విధమైన వాస్తవాలు బట్టబయలవుతుంటే టిడిపి నేత అబ్దుల్ అజీజ్ తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆ స్థల వివాదంలో ఏ విచారణకైనా తాను సిద్ధమని వ్యాఖ్యానించారు.

2నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సీతారామపురం : క్రిస్మస్ పండుగ సందర్భంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ 2వ తేదీ నుండి ప్రారంభమవుతుందని టోర్నమెంట్ నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం వారు వివరాలు తెలుపుతూ గురువారం సీతారామపురం అరుంధతీయవాడలో ఉన్న ఆర్‌సిఎం చర్చి మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమవుతాయని తెలిపారు. 8500128808, 9494798227, 9866419050 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

ప్రజలు నివసిస్తున్న పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని విశ్వనాథరావుపేట సర్పంచ్ గండూరి మంజుల పేర్కొన్నారు. ఇటీవల వర్షానికి మురికి కాలవల్లో పెరిగిన మొక్కలను మంగళవారం పారిశుధ్య కార్మికులతో తొలగించి ఆయిల్ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గండూరి మంజుల మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నివసిస్తున్న ప్రదేశాల్లో టెంకాయ చిప్పలు, ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చెదారం వంటివి ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువగా దోమల కారణంగా రకరకాల జ్వరాలతో ప్రబలుతున్నాయని, మనం ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందవని, పంచాయతీకి సంబంధించిన అన్ని శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్‌ను వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వనాథరావపేట పంచాయతీ కార్యదర్శి మహమ్మద్‌భాషా, చైతన్య, వైసిపి నాయకులు గండూరి శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట సివిల్ అసిస్టెంట్ సునీల్, ఉప సర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, వార్డ్‌మెంబర్ బొంత సుధీర్, వాలంటరీ కిషోర్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Senior Civil Judge : Kovur

I.A.No. 302 / 2022
O.S.No. 121 / 2012

1. **Syed Momola Begam** and 4 others - Petitioners / Plaintiffs

Vs

1. **Sk. Munwar Shareef** (Died) and 16 others - Respondents

Notice

To,
R2. **Syed Samdani Begum,** Wife of **Rahamthullah,** House Wife, R/ at :- D.No. 21-557, Panagalaraja Road, Janda Veedhi, Nellore.
R3. **Mogal Haseena Begum,** Wife of **Jamruddin,** House Wife, R/ at:- 21/144, Panagalaraja Road, Janda Veedhi, Nellore.
R4. **Mohammad Meherunnisa,** Wife of **Abdul Subhan,** House Wife, R/ at:- 21/144, Janda Veedhi, Nellore.

పై నెంబరున పిటిషనర్లు/వాదులు పై తెలిపిన కోర్టులో డాక్యుమెంట్స్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే**01-12-2022** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవ లసినది.లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వరిగొండ రమేష్, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్లు / వాదుల తరపు అడ్వకేట్, నెల్లూరు.

డాక్యుమెంట్ పోయినవి

గిన్నె బాలాజీ అనిల్, తండ్రి గిన్నె వెంకటేశ్వర్లు పడమటి నాయుడుపల్లి గ్రామం, మర్రిపాడు మండలం, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, హౌస్‌ఫ్లాట్ లింక్ **డాక్యుమెంట్ నెం.1281/2009** డాక్యుమెంటు **తేది: 01-06-2009** టైటిల్ పోయినవి దొరికిన వారు అందజేయగలరు.

ఇట్లు
ఎం. చంద్రశేఖర్ రెడ్డి
సెల్ నెంబర్ : **9440028397.**

డాక్యుమెంట్ షేర్ బాండ్స్ పోయినవి

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, పరకొండపాడు గ్రామానికి చెందిన **చెరుకూరి బ్రహ్మయ్య,** తండ్రి **చెరుకూరి అంజయ్య** కు సంబంధించిన **ల్యాండ్ డాక్యుమెంట్ నెంబర్ 3910/2011, ప్లాట్ నెంబర్ 413,** అలాగే స్టేట్ బ్యాంక్ బాండ్స్ (50) (చెరుకూరి బ్రహ్మయ్య పేరుతో ఉన్నవి) నెంబర్.**01822578** మరియు డిమాట్ అకౌంట్ బుక్ నవంబర్ 17వ తేదీన పరకొండపాడు గ్రామం నుండి గుడ్లూరు మోటారు సైకిల్‌పై వస్తుండగా పోయినవి అవి ఎక్కడా కనిపించలేదు.కావున పై డాక్యుమెంట్లు ఎవరికైనా కనిపించినచో ఈక్రింది అడ్రస్ కు తెలియ పరచగలరు.

ఇట్లు
చెరుకూరి బ్రహ్మయ్య
తండ్రి **చెరుకూరి అంజయ్య,**
మాజీ సర్పంచ్
కాంటాక్ట్ నెంబర్. **9849159610**
పరకొండపాడు గ్రామం గుడ్లూరు మండలం
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.